క్లుప్తంగా

పిల్లలను బడిలో చేర్పించండి



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

పెద్దకడబూరు : మండలంలో ఇంకా ఎవరైనా విద్యార్థులు బడి బయట ఉన్నారేమో గుర్తించి బడిలో చేర్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఆదిఆంధ్ర పాఠశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థుల హాజరు శాతం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ వలంటీర్ల సహాయంతో బడి బయట పిల్లలను గుర్తించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. అనంతరం ఎస్సీ కాలనీలో పర్యటించి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ జనార్దన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఓటర్ల జాబితా పరిశీలన

కౌతాళం: మండలంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ బీఎల్ఓల ఆధ్వర్యంలో కొనసాగుతోందని తహసీల్దార్ రామేశ్వరరెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఓటరు జాబితాలోని తప్పులను సరిచేసి కొత్త జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించడంతో జూలై 21 నుంచి ప్రక్రియ ప్రారంభమైందని, ఈనెల 20వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. బీఎల్ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి వాస్తవ ఓటరు జాబితాను పరిశీలించి చిరునామా, వయస్సు వంటి సవరణ ఉంటే ఇంటి యజమానుల ప్రమేయంతో చేస్తారని, మరణ, వివాహమై వేరే ప్రదేశంలో ఉన్న వారిని జాబితా నుంచి తొలగిస్తామని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు సరైన ఆధారాలు బీఎల్ఓలకు ఇస్తే జాబితాలో చేర్చుతారన్నారు.

ఉరుకుందలో భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో ఈరన్నస్వామి

కౌతాళం: మండలంలోని ఉరుకుంద క్షేత్రంలో వెలసిన ఈరన్నస్వామిని సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహా మంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫల,పుష్పాలతో అలంకరించారు. కొందరు భక్తులు ఆలయ పరిసరాల్లో పిండి వంటలు వండి స్వామి వారికి నైవైద్యంగా సమర్పించి, ప్రత్యేక అభిషేకాలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు.

2 నుంచి శ్రీమద్భాగవత ప్రవచనాలు

ఆదోనిఅర్బన్: ఈనెల 2 నుంచి 6వ తేదీ వరకు పట్టణ శివారులో వెలిసిన శ్రీ మంగరాయ సన్నిధిలో శ్రీమద్భాగవత ప్రవచనాల కార్యక్రమం ఉంటుందని ఆలయ మేనేజర్ వాసుదేవరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి వేద పండితుడు శ్రీ సుస్వరం నాగరాజ ఆచార్యులు ప్రవచనాలు వినిపిస్తారని, 6న అధిక శ్రావణకృష్ణ పక్ష పంచమి సందర్భంగా సన్నిధిలోనే పవమానహోమం, అపూదదానసేవ, బ్రాహ్మణ దంపతుల భోజన సేవ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సెల్ 9985706489 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఎంఈఓకు గాయాలు

కోసిగి: ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ఎంఈఓ–2 నాగేశప్ప బైక్ పై నుంచి అదుపుతప్పి కింద పడి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సోమవారం ఆదోని నుంచి ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనం చేసుకొని విధి నిర్వహణలో భాగంగా కోసిగికి వస్తుండగా రైల్వేగేటు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి కిందపడిపోయాడు. దీంతో కాలుపై బైక్ సైలెన్సర్ కాలి గాయాలయ్యాయి. స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించుకున్నారు.

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి దంపతులు

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని ఆస్పరి రోడ్డులో ఉన్న జీవనజ్యోతి ఆశ్రమంలో సోమవారం ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి తన కుమారుడు జయశివసాయితేజ జన్మదినం సందర్భంగాఅన్నదానం ఏర్పాటు చేశారు. డీఎస్పీ, ఆయన సతీమణి ఆశ్రమాన్ని సందర్శించి వృద్ధులను, అనాథలను పరామర్శించారు. వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ డైరెక్టర్ విక్టర్ పాల్ ఫిలిప్ ఉన్నారు.



■ **బీమాకు ఉపయోగపడ్డాయి..**

ఈ ఆటో డ్రైవర్ పేరు శ్రీరాములు, ఆదోని పట్టణంలోని ఇందిరానగర్‌లో నివాసముంటున్నాడు. కొన్నేళ్లుగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజుకు రూ.400 నుంచి రూ.500 మించి మిగలదని, ఇక..ఇన్సూరెన్స్, బండి రికార్డులు, కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. వీటికి తోడు ఆటోలు అధికం కావడంతో పోటీ పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తమను ఆదుకునేందుకు వాహనమిత్ర పేరుతో ఏటా రూ.10వేలు అందజేయడం సంతోషంగా ఉంది. ఈ మొత్తంతో ఆటో ఇన్సూరెన్స్‌కు ఇబ్బందులు తొలగిపోయాయని చెబుతున్నాడు.



■ **సంతోషంగా ఉంది..**

ఈయన పేరు లక్ష్మన్న. పట్టణంలోని ఉప్పరగేరిలో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. 'గతంలో కన్నా ప్రస్తుతం ఆటోల మధ్య పోటీ తీవ్రం కావడంతో ఆదాయం అంతంత మాత్రంగానే ఉంది. తమ నుంచి ప్రభుత్వానికి ఆదాయం లభిస్తున్నా.. మూడేళ్ల క్రితం వరకు మాకంటూ ప్రత్యేక పథకాలేవీ అమలు కాలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత వైఎస్సార్ వాహన మిత్ర పథకం ప్రారంభించి మాకు ఏడాదికి రూ.10వేలు అందజేస్తుండటంతో కుటుంబ పోషణ, బండి నిర్వహణకు కొంత ఊరట లభిస్తుంది. మాకు సాయం అందజేస్తుండటంతో సంతోషంగా ఉంద'ని చెబుతున్నాడు..

వాహనదారులకు అండగా.. 'వాహన మిత్ర'

ఆటో, మాక్సీ, ట్యాక్సీల నుంచి ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. అయినా వాటి యజమానుల అవసరాలు, సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయి. అయినా వాహనదారులు అతి కష్టం మీద జీవితాలను నెట్టుకొచ్చేవారు. వారి సమస్యలను గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.. తాను అధికారంలో వస్తే ప్రత్యేక పథకం ద్వారా సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత వైఎస్సార్ వాహనమిత్ర పేరుతో పథకం ప్రారంభించి మెయింటనెన్స్ ఖర్చులు, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు తదితర వాటి కోసం ఏటా రూ.10వేలు అందజేసి అండగా నిలుస్తుండటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- ఆటో, మాక్సీ, టాక్సీ యజమానులకు ఏటా రూ.10వేల సాయం
- మూడేళ్లలో 2,031 మందికి రూ.2కోట్లకు పైగా లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

ఆదోనిటౌన్ : పాదయాత్ర సమయంలో ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ ఆటో డ్రైవర్‌లకు అండగా నిలుస్తానని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. మీ కష్టాలను నా కష్టాలుగా భావిస్తా.. అధికారంలోకి వచ్చిన వెంటనే మీ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మూడేళ్లుగా వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ డ్రైవర్‌లకు ఏడాదికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. వాహనాల నిర్వహణ ఖర్చులు, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు పొందడానికి ప్రభుత్వం వీలు కల్పించింది. దీంతో ఆ వాహనదారుల కష్టాలు తొలిగాయి. అర్హులైన ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ యజమానులకు ప్రభుత్వం నేరుగా వారి బ్యాంక్ ఖాతాలో ఏటా రూ. 10 వేలు జమ చేస్తుంది. 2021 జూన్ 1నుంచి వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద ఆదోని పట్టణంలో వేలాది మంది వాహన యజమానులు లబ్ధి పొందుతున్నారు.

ఆదోని పట్టణంలో ఆటోల వివరాలు..

ఆదోని పట్టణంలో ప్యాసింజర్ ఆటోలు 2,850 ఉండగా, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆటోలు 3 వేలు ఉన్నాయి.

- వ్యాపార, వాణిజ్యకేంద్రం కావడంతో సీజన్‌లో వివిధ గ్రామాల నుంచి ఆదోనికి వచ్చివెళ్లే ఆటోలను కలుపుకుంటే 10 వేలు పైగానే ఉన్నాయి.

పథకం పొందడానికి అర్హతలు..

- 18 యేళ్ల వయస్సు పైబడి ఉండాలి.
- స్థానికంగానే నివాసం కలిగి ఉండాలి.
- రేషన్‌కార్డులో పేరు తప్పనిసరిగా ఉండాలి
- ఈ పథకం కింద లబ్ధి పొందాలంటే సొంతంగా ఆటో, ట్యాక్సీ ఉండాలి. లైసెన్సును కలిగి ఉండాలి. పేద కుటుంబం వారికే వర్తిస్తుంది.
- ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, బీపీఎల్ లేదా తెల్ల రేషన్‌కార్డు కచ్చితంగా ఉండాలి.
- వాహనం రికార్డులు యజమాని పేరుపైనే ఉండాలి.
- ఆదాయ ధ్రువపత్రం, బ్యాంకు ఖాతా తప్పనిసరి



ఆటోలతో డ్రైవర్లు

ఆదోని పట్టణంలో 2021 జూన్ 1 నుంచి నేటి వరకు వైఎస్సార్ వాహన మిత్ర పథకం కింద 2,031 మంది లబ్ధి పొందారు. మొత్తం రూ.2,03,30,000 సాయాన్ని ప్రభుత్వం అందజేసింది.

- 2021లో 646 మంది ఆటో డ్రైవర్‌లు రూ.64,80,000 లబ్ధి పొందారు.
- 2022లో 676 మంది డ్రైవర్‌లకు రూ.67,60,000 మంజూరైంది.
- 2023లో 709 మంది ఆటో డ్రైవర్‌లు రూ.70,90,000 సాయం పొందారు.

కాలువ నిర్మాణం పూర్తి చేయాలి

పెద్దకడబూరు : రాజోలిబండ డైవర్షన్ స్కీం కుడికాలువ నిర్మాణాన్ని తక్షణమే పూర్తిచేసి రైతులకు సాగు, తాగునీరు అందించాలంటూ సీపీఐ నాయకులు కోరారు. సోమవారం మండల కేంద్రంలో సంతకాల సేకరణ చేపట్టారు.రైతుసంఘం నాయ కులు మబ్బు ఆంజనేయ మాట్లాడుతూ ఆర్డీఎస్ ద్వారా మంత్రాలయం, ఎమ్మిగనూరు,కోడుమూరు నియోజకవర్గంలోని సుమారు 40వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. తిక్కన్న, డోలు హనుమంతు, రామాంజినేయులు, సర్దార్‌పటేల్, హయత్‌పటేల్, గోపాల్, నరసింహులు పాల్గొన్నారు.

కౌతాళం: మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాలు అభివృద్ధి కావలంటే రాజోళిబండ ఆనకట్ట కుడి కాలువతోనే సాధ్యమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, కౌతాళం మండల కార్యదర్శి ఈరన్న పేర్కొన్నారు. ఆర్డీస్ కుడి కాలువ నిర్మాణానికి నిధులు కేటాయించాలని సోమవారం కౌతాళంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఏఐటీయూసీ నాయకులు వెంకటస్వామి, రాముడు, తిమ్మప్ప, నరసప్ప, శ్రీనివాసులు, జాలాల్ పాల్గొన్నారు.

యార్డులో ఊడిన పై పెచ్చులు

ఆదోనిఅర్బన్ : ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో కమీషన్ ఏజెంట్ల దుకాణంలో పై పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఏజెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారస్థులు, కమీషన్ ఏజెంట్లు, కూలీలు, హమాలీలు, రైతులు లేనప్పుడు పై పెచ్చులు ఊడిపడడంతో ప్రమాదం తప్పింది.

భక్తిశ్రద్ధలతో జియారత్

కౌతాళం: మండలంలోని అన్ని గ్రామాల్లోని పీర్ల చావిడిల వద్ద జియారత్‌ను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పీర్లచావిడిల్లో మొహర్రం మాసంలోని 12వ రోజున జియారత్‌ను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామస్తులు జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గా నుంచి బయలుదేరి హసన్ హుసేన్ సాహెబ్, ఇమాంకాశీం, అక్బర్‌వలి, బార ఇమామ్, ముల్లారు వీది పీర్ల చావిడిల వద్ద ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు.

ఆదోని నుంచి అరుణాచలంకు బస్సు సర్వీసు

ఆదోనిటౌన్ : ఆదోని నుంచి అరుణాచలంకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసును సోమవారం డీఎం రఫిక్‌అహ్మద్, అసిస్టెంట్ మేనేజర్ రాఘవేంద్ర ప్రయాణికులతో కలిసి ప్రారంభించారు. డీఎం మాట్లాడుతూ మంగళవారం ఉదయం 5 గంటలకు కాణిపాకం చేరుకొని దర్శనం అనంతరం 10 గంటలకు వేలూరులోని గోల్డెన్ టెంపుల్ సందర్శన, మధ్యాహ్నం 2 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. ముందుగా స్వామివారి సందర్శన, గిరి ప్రదక్షణ అనంతరం బుధవారం ఉదయం తిరుగు ప్రయాణమవుతుందన్నారు. ఆదోని నుంచి అరుణాచలంకు రూ.2,200 చార్జీ ఉండగా, పత్తికొండ నుంచి రూ.2,100 నిర్ణయించామని చెప్పారు. ప్రతి పౌర్ణమికి ఆదోని నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సు ఏర్పాటు నడుస్తుందన్నారు. ఎవరైనా 30–40 అరుణాచలంకు వెళ్లేందుకు గ్రూపుగా వస్తే బస్సు ఏర్పాటు చేస్తామని తెలిపారు. డిపో గ్యారేజ్ ఏఈ వేణుగోపాల్ పాల్గొన్నారు.



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న అధికారులతో ప్రయాణికులు

న్యాయవాదిని చంపిన వారిపై చర్యలు తీసుకోవాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న న్యాయవాదులు

ఆదోనిరూరల్ : బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది ఆదిశేషులు విఠల్‌బాబును దారుణంగా చంపిన వారిని కఠినంగా శిక్షించాలని ఆదోని బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు అనితాబాయి, వైస్ ప్రెసిడెంట్ సునీతరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట న్యాయవాదులు విధులను బహిష్కరించి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సీనియర్ న్యాయవాదులు వై.ఆర్.మల్లికార్జున, జీవీ దేశాయ్, శివకుమార్ స్వామి, సావిత్రి, తబ్రేజ్, హాజీ, జీవన్‌సింగ్, జూనియర్ న్యాయవాదులు హుసేన్‌సాని, కళ్యాణ్ రెడ్డి, సాయికుమార్ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ర్యాలీ

ఆదోని సెంట్రల్/ ఆదోని రూరల్: మణిపూర్ సంఘటనలకు నిరసనగా పాస్టర్లు, ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో భారీ శాంతి ర్యాలీ చేపట్టారు. ఆర్‌సీఎం చర్చి ఆవరణలో ప్రార్థనల అనంతరం ర్యాలీగా భీమాస్ సర్కిల్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం చేరుకున్నారు. అక్కడ నిరసన వ్యక్తం చేసి సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ యువనేత జయమనోజ్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాస్టర్లు ఆనంద్‌రాజు, బెనర్జీరాజు, జాషువ ప్రజా సంఘాల నాయకులు దేవిశెట్టి ప్రకాశ్, అజైయ్ బాబు, నూర్ అహ్మద్ మాట్లాడుతూ స్వార్థరాజకీయల కోసం సామాన్య ప్రజలను హింసించడం సరికాదన్నారు. మహిళలకు గౌరవం ఇచ్చే దేశంలో రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సంఘాల నాయకులు లక్ష్మన్న, శాంతకుమార్ పాస్టర్లు భాస్కర్, ఎంఎస్‌రావు,, డానియేల్‌ప్రేమ్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

పెద్దకడబూరు : మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండకు నిరసనగా నియోజకవర్గ పాస్టర్స్ కమిటీ అధ్యక్షుడు సీఎస్ఐ రెవరెండ్ పాస్టర్ ముత్తు మనోహర్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు క్రైస్తవులు, పాస్టర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో మూడు నెలలుగా క్రైస్తవులపై జరుగుతున్న మారణ హోమాలు, అత్యాచారాలను అరికట్టడంలో బీజేపీ ప్రభుత్వం విఫలం అయ్యిందని మండిపడ్డారు. అనంతరం తహసీల్దారు వీరేంద్రగౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు. నాయకులు సంజీవరావు, ఏసేపు, తిక్కన్న, ముక్కరన్న, లోకేష్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జయమనోజ్‌రెడ్డితో పాటు పాస్టర్లు, నాయకులు

కోసిగి మండల అభివృద్ధికి కృషి

- మండల స్థాయి అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: మండల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ఇప్పటికే పలు అభివృద్ధి చేపట్టామని, మరిన్ని కొనసాగుతున్నాయని, ఇంకా చేస్తామని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ కుమారి అయ్యమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, తహసీల్దార్ రుద్రగౌడ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో తాగు, సాగునీటి కష్టాలు లేకుండా రూ.6 కోట్లతో పులికనుమ మిగులు బడ్జెట్‌తో కోసిగి ప్రాంతానికి సాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భూగేని చెరువు వద్ద సమ్మర్ స్టోరేజీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, త్వరలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రూ.1.10 కోట్లతో కందుకూరు, ఐరన్‌గల్లు గ్రామాల్లో లిఫ్ట్ ఇరిగేషన్‌తో పాటు డి.బెళగల్ నుంచి పల్లెపాడు వరకు కాల్వ లైనింగ్ పనులు చేయించామని చెప్పారు. అలాగే ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు రూ.16కోట్లు మంజూరు చేయించగా ఇది వరకే గొడగల్లులో పనులు పూర్తి కాగా, డి.బెళగల్, దొడ్డి, తుంబిగనూరు గ్రామాల్లో పనులు జరుగుతున్నట్లు తెలిపారు. కోసిగిలో దాదాపు రూ.3 కోట్లతో డ్రైనేజీ, సీసీ రోడ్లు వేయించామని, రూ.28 కోట్లతో నాడు–నేడు కింద పాఠశాలల రూపు రేఖల మార్చేశామని వివరించారు. గ్రామాల వారీగా అభివృద్ధి పనులు, సమస్యలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు పెండింగ్ ఉన్న సమస్యలను నేరుగా సంబందిత శాఖ అధికారులతో విచారించి వెంటనే పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయించాలని హౌసింగ్ డీఈ లాల్ కృష్ణయ్య, ఏఈ రాజశేఖర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ అశ్వత్థామ, ఏఈలు యుగంధర్ రెడ్డి, వీరేష్, మల్లికార్జున రెడ్డి , రంగరాజు, ఏఓ రాజు, డాక్టర్ మనోజ్‌కుమార్, ఎంఈఓ–2 నాగేశప్ప, సీఐ ఎరిసా వలి, ఎస్ఐ సతీష్‌కుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, ఐరన్‌గల్లు శ్రీనివాస రెడ్డి, నాడుగేని నరసింహులు, మహంతేష్ స్వామి, కోఆప్షన్ మెంబర్ సౌకత్ అలీ, మాణిక్యరాజు, నాడుగేని నాగరాజు, బుల్లి నరసింహులు, జగదీష్ స్వామి,మంగమ్మ, బీమక్క, గానిగి వీరస్వామి, ఉస్మాన్, నూర్ అహ్మద్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి



సమావేశానికి హాజరైన అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

బాల్య వివాహాలు చేయడం నేరం

మంత్రాలయం రూరల్: బాల్య వివాహాలు చేయడం నేరమని ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తెలిపారు. సోమవారం సూగూరు గ్రామంలో ప్రజలకు నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు పెరిగిపోయాయని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

విద్యుత్‌శాఖ సిబ్బంది నిరసన

ఆదోని అర్బన్ : డివిజన్‌లో విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి, సమాన పనికి సమాన వేతనం అందించాలని జేఏసీ నాయకులు కోరారు. సోమవారం మున్సిపల్ పార్కులోనున్న మహాత్మా గాంధీజీ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన తెలియజేశారు. జేఏసీ అధ్యక్షుడు జాన్‌బాబు, కార్యదర్శి పురుషోత్తం మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఏకసభ్య కమిషన్ రద్దు చేసి పీఆర్‌సీ–2022ని వెంటనే అమలు చేయాలన్నారు. జగ్గయ్యనాయక్, శారద, నాగభూషణం, చెన్నయ్య పాల్గొన్నారు.

'అమ్మఒడి–ప్రేమబడి' పుస్తకావిష్కరణ

పెద్దకడబూరు : మండలంలోని కంబదహాళ్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్య వేత్త, బాలబంధు గద్వాల సోమన్న కొత్తగా రచించిన 38వ పుస్తకం అమ్మఒడి–ప్రేమబడి బాలగేయాల సంపుటి పశ్చిమగోదావరి జిల్లాలోని నరసాపురంలో సోమవారం అవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గురుసహస్రావధాని శ్రీ కడిమిళ్ల వరప్రసాద్, పెన్మత్స సత్యనారాయణ, పొన్నాడ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా నరసాపురంలోని అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రంలో పుస్తకాన్ని అవిష్కరించామని చెప్పారు. అతి తక్కువ సమయంలో 38 పుస్తకాలను ప్రచురించడమే కాకుండా బాలసాహిత్యంలో విశిష్ట సేవలను అతిథులు కొనియాడారు. అనంతరం విశేష తెలుగు సాహితీ కృషికి ఆయనను సత్కరించారు. కవులు, ఉపాధ్యాయులు చక్రావధానుల రెడ్డప్ప, ధవేజీ, డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, షేక్ సిలార్ సాహెబ్, మంకు శ్రీను, గాదిరాజు రంగారాజు, గిడుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ గావిస్తున్న సాహితీవేత్తలు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

ఆదోని సెంట్రల్: పెండింగ్‌లో ఉన్న పురపాలక ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్నకు స్థానిక నాయకులు నాగరాజు,వీరచంద్ర యాదవ్ సోమవారం విన్నవించారు. ఎస్‌టీయూ జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశంలో ఉమ్మడి సర్వీస్ రూల్స్ విడుదల చేసి పదోన్నతులు, బదిలీలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఈఓ, డిప్యూటీ ఈఓ పోస్టులకు పురపాలక ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు గోకారి, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, షఫీ పాల్గొన్నారు.

పాముకాటుకు మహిళ మృతి

కౌతాళం: పాము కాటుకు ఓ మహిళ మృతి చెందిన సంఘటన కౌతాళం పోలీసు స్టేషన్ పరిధిలోని నదిచాగి గ్రామంలో చోటు చేసుకుంది. హొళగుంద మండలం చిన్నహట్టి గ్రామానికి చెందిన అనురాధ (45) మొహర్రం పండుగకు ఆమె పుట్టినిల్లు నదిచాగి గ్రామానికి వచ్చింది. కాగా ఆదివారం రాత్రి ఇంటి వద్ద నిద్రిస్తున్న ఆమెను పాము కాటు వేయగా కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక సోమవారం సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త శరణ బసవయ్యస్వామి ఉన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

ఆదోనిరూరల్ : పట్టణంలోని బాలనాగన్న చెరువు వద్ద అటవీ ప్రాంతంలో ఉంచిన సుమారు 200 లీటర్ల బెల్లం ఊటను, 5 లీటర్ల నాటుసారాను గుర్తించి ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ హరికృష్ణ సోమవారం తెలిపారు. నాటుసారా కాస్తున్న ఆదోనికి చెందిన బోయనాగిరెడ్డిని అరెస్టు చేశామని చెప్పారు. అలాగే కౌతాళం మండలంలోని కామవరం గ్రామానికి చెందిన నరసింహులు, నరసమ్మ నుంచి 68 ఓసీ డీలక్స్ విస్కీ మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

ఆదోని రూరల్ : స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలని ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం కూడదని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. ముఖ్యంగా అర్జీదారులను సంతృప్తి పరిచేలా పరిష్కారం చూపాలని సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులకు ప్రజల సమస్యలను తెలియజేసి వారంలోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గోవింద్‌సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, వ్యవసాయ శాఖ ఏడీ గిరీష్‌కుమార్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలను వింటున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

అర్జీల ద్వారా వచ్చిన సమస్యల్లో కొన్ని..

– ఆదోని మండలం దిబ్బనకల్ గ్రామానికి చెందిన చాకలి లక్ష్మమ్మకు గోనెగండ్లలో సర్వే నంబర్ 296లో 4.50 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.

– నందవరం మండలం ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన గఫూర్‌బాషాకు సర్వేనంబర్ 117/ఏలో 9.24 ఎకరాల భూమి ఉండగా ఆన్‌లైన్‌లో 8 ఎకరాలు మాత్రమే ఉందని, మిగిలిన 1.24 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు.

– ఆదోని మండలం మండగిరి పంచాయతీలో సర్వే నంబర్ 565లో 25 సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రజలకు అవసరమయ్యే వాటికి వినియోగించాలని పట్టణంలోని పద్మశాలినగర్‌కు చెందిన వై.ఎం.సూర్య అర్జీ అందజేశారు.

– కడివెళ్ల గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీలో తాగు నీటి సమస్య ఉందని, నీటి ఎద్దడిని తీర్చాలని ఎమ్మిగనూరు మండలం కడివెళ్ల గ్రామానికి చెందిన జి.రాజశేఖర్ అర్జీలో కోరారు.

– ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ కార్యాలయాలు, వ్యాపార సముదాయాలు, బ్యాంకుల వద్ద ప్రజలకు అనుగుణంగా శౌచాలయలను ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మంత్రాలయం రూరల్: ఈ నెల 29, 30 తేదీల్లో గార్గేయపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆరవ రోప్ స్కిప్పింగ్ పోటీల్లో మంత్రాలయం విద్యార్థులు ప్రతిభ చాటారు. స్థానిక వైష్ణవి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కార్తీక్ గౌడ్ అండర్–14 సైక్లింగ్ ఈవెంట్‌లో ద్వితీయ స్థానం, 7వ తరగతి విద్యార్థి లక్ష్మన్‌గౌడ్ అండర్–14 ఫ్రీ స్టైల్ ఈవెంట్‌లో ప్రథమస్థానం, నరసింహుడు అండర్–12 డబుల్ అండర్ ఈవెంట్‌లో తృతీయ స్థానం సాధించారు. అలాగే జీనియస్ గ్లోబల్ ఇంగ్లిష్ మీడియం ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బి.ఉత్తేమ కుమార్ అండర్–14 స్పీడ్ ప్రింట్ ఈవెంటులో ప్రథమ స్థానం సాధించారు. వారిని పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.